సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం। 13। అక్టోబర్। 2025



రూ.లక్ష విరాళం

కొత్తపేట: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామివారి నిత్యాన్నదాన పథకానికి జన్ను రమేష్, లావణ్య దంపతులు (విజయవాడ కానూరు) ఆదివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



పదికి చేరిన బాణసంచా మృతులు

ఈ నెల 8న రాయవరంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో గాయపడిన మరో ఇద్దరు ఆదివారం మృతి చెందారు. దీంతో, ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 10కి చేరింది.

8 లో

సముద్రంలోకి 2.69 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 2,69,135 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,100, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.40, భద్రాచలం వద్ద 24.20 అడుగులుగా నీటిమట్టాలు నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

నకిలీ మద్యంపై నేడు వైఎస్సార్ సీపీ ధర్నా

రాజమహేంద్రవరం రూరల్: ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ రాష్ట్రంలో విచ్చలవిడిగా తయారు చేస్తున్న నకిలీ మద్యాన్ని అరికట్టాలనే డిమాండుతో వైఎస్సార్ సీపీ సోమవారం ధర్నా నిర్వహించనుంది. అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ **జగన్‌మోహన్‌రెడ్డి** ఆదేశాల మేరకు ఉదయం **11 గంటలకు** బొమ్మూరులోని కలెక్టరేట్ వద్ద **వైఎస్సార్ సీపీ** మహిళా నేతల ఆధ్వర్యాన **ధర్నా నిర్వహిస్తున్నట్లు** పార్టీ జిల్లా అధ్యక్షుడు, **మాజీ మంత్రి** చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలోని పార్టీ నేతలు, మహిళలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని వేణు పిలుపునిచ్చారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వాతావరణ మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత బీసీ సంక్షేమ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖలు, లేపాక్షి ఎంపోరియం అధికారులతో ఆమె నగరంలో ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో బీసీ హాస్టళ్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని, దోమలు రాకుండా మెష్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీరు, తాజాగా వండిన ఆహారం మాత్రమే విద్యార్థులకు అందించాలన్నారు. విశ్రాంతి, తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బయటి ఆహారం తీసుకురానీయవద్దని స్పష్టం చేశారు. ప్రతి వసతి గృహం, గురుకుల పాఠశాలలో సీసీ కెమెరాలు, మినరల్ వాటర్ ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆప్కో, లేపాక్షి విక్రయాలు పెంచేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, ఏపీ బీసీ కో ఆపరేటివ్ గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఆర్‌డీఓ ఆర్.కృష్ణనాయక్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి.శశాంక, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, ఆప్కో జీఎం కె.పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా బాక్సింగ్ పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): వాగ్వాదాలు, స్టేజీపై గొడవలతో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం రసాభాసగా మారాయి. స్థానిక ఎస్‌కేవీటీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మూడో రోజు జరిగిన పోటీల్లో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. క్రీడాకారులకు అన్యాయం జరిగిందంటూ వారి వెంట వచ్చిన తల్లిదండ్రులు, కోచ్‌లు వేదిక పైకి ఎక్కి జడ్జిలతో వాగ్వాదానికి దిగారు. అలాగే, బాక్సింగ్ రింగ్ వద్ద వివాదం తలెత్తింది. కొందరు ఘర్షణకు దిగడంతో పాటు పరుష పదజాలంతో ఒకరినొకరు కొట్టుకునే వరకూ పరిస్థితి వచ్చింది. మిట్ట మధ్యాహ్నం ఓపెన్ రింగ్‌లో బాక్సింగ్ పోటీలు నిర్వహించడంతో నిర్వాహకులపై బాక్సింగ్ కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు అసహనం వ్యక్తం చేశారు.



యంత్రాలతో వరి కోతలు



పంట కోత యంత్రంతోనే బస్తాల్లోకి ధాన్యం లోడింగ్

ఇదేం ధరయ్యా!

- మెట్టలో వరి కోతలు ప్రారంభం
- ఎకరానికి 30 – 35 బస్తాల దిగుబడి
- కొనుగోలు కేంద్రాలు ప్రారంభించని సర్కారు
- ఇదే అదనుగా ధర తగ్గించేసిన మిల్లర్లు
- గత ఏడాది ఖరీఫ్‌లో బస్తాకు రూ.1,850 పలికిన ధర
- నేడు రూ.1,400 మాత్రమే చెల్లింపు
- నష్టపోతున్న రైతులు

రాజానగరం: ఎండనక వాననక.. పగలనక.. రేయనక.. రాళ్లు, రప్పలు.. పాములు.. విషక్రిములతో అరుగాలం యుద్ధం చేస్తూ.. స్వేదం చిందించి.. నేలను కదిలించి.. కన్నబిడ్డలా సాకిన పంట పసిడి కంకులతో మెరిసిపోతున్న వేళ.. రైతన్నల కష్టం చేతికందే సమయం ఆసన్నమైంది. జిల్లాలో ఖరీఫ్ వరి కోతలు క్రమంగా మొదలవుతున్నాయి. కానీ, ప్రభుత్వం ఇప్పటి వరకూ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో, ధాన్యాన్ని నష్టానికి అమ్ముకోవలసి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

80,975 హెక్టార్లలో వరి సాగు

ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా రైతులు 80,975 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. ఇందులో పంట కాలువల ద్వారా 38 వేల హెక్టార్లు, గొట్టపు బావుల ద్వారా 42 వేల హెక్టార్లు ఉండగా, మిగిలిన సాగు వర్షాధారం. జిల్లాలో మెట్ట ప్రాంతమైన రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో అధిక శాతం రైతులు గొట్టపు బావుల కింద తక్కువ కాలవ్యవధిలో దిగుబడినిచ్చే సన్న రకాలు సాగు చేశారు. అవి పక్వానికి రావడంతో వరి కోతలు ప్రారంభించారు. ఎక్కువ మంది యంత్రాలతో వరి కోతలు చేపట్టారు. కోత కోసిన తరువాత ధాన్యాన్ని ఆ యంత్రాలతోనే బస్తాల్లోకి లోడ్ చేయించి, లారీలకు ఎక్కిస్తున్నారు. ఎకరానికి 30 నుంచి 35 బస్తాల వరకూ దిగుబడి వస్తోంది. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా మరో 20 రోజుల్లో కోతలు ప్రారంభమవుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక..

ఇతర ప్రాంతాలతో పోలిస్తే మెట్ట రైతులు ప్రతి సీజన్‌లోనూ ముందుగానే వరి కోతలు ప్రారంభిస్తారు. ఇది సర్వసాధారణంగా జరిగేదే. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి. కానీ, ఇప్పటి వరకూ అలా జరగకపోవడంతో గిట్టుబాటు ధర దక్కని దుస్థితి ఏర్పడిందని ఇక్కడి రైతులు ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో ఇటువంటి దుస్థితి ఉండేది కాదని, వరి కోతలు ప్రారంభమైన వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధర ప్రకటించేవారని గుర్తు చేసుకుంటున్నారు. దీంతో, అంతకంటే ఎక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేయడానికి మిల్లర్లు ముందుకు వచ్చేవారని చెబుతున్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేనందు వల్లనే మిల్లర్లు ఇష్టారాజ్యంగా తక్కువ ధరకు ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారని వాపోతున్నారు.

ధరలో దగా

మార్కెట్‌లో ప్రస్తుతం ధాన్యం బస్తాకు ధర తక్కువగా పలుకుతోంది. అయినప్పటికీ రైతులు కోసిన పంటను ఆరబెట్టి, విక్రయించేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఎక్కువ ధర వస్తుందనే ఆశ ఉన్నా ఆరబెట్టడానికి అయ్యే వ్యయప్రయాసలను దృష్టిలో పెట్టుకుని పండిన పంటను పొలాల నుంచే అయిన కాడికి విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇదే అదనుగా మిల్లర్లు, దళారులు ధరలో కోత పెడుతున్నారు. గత ఏడాది ఖరీఫ్‌లో వరి కోతలు ప్రారంభమైన సమయానికి బస్తా (75 కిలోలు) ధాన్యానికి మార్కెట్‌లో రూ.1,850 వరకూ ధర పలికింది. దీనితో పోల్చితే ఈ ఏడాది కాస్త పెరుగుదల ఉంటుందని అన్నదాతలు ఆశ పడగా.. గత ఏడాది కంటే బస్తాకు రూ.350 వరకూ తగ్గించి, రూ.1,400 మాత్రమే రైతుకు చెల్లిస్తున్నారు. దీంతో, రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.


అన్నీ భరించేది అన్నదాతలే..



సాగులో ఎదురయ్యే కష్టనష్టాలతో పాటు మార్కెట్‌లో ఏర్పడే ఒడుదొడుకులన్నింటినీ భరించేది అన్నదాతలే. ప్రకృతి కరుణించి, చీడపీడల బెడద లేకపోతే మంచి దిగుబడులు వస్తాయి. లేకుంటే ఆశించిన దిగుబడులు రావు. అన్నీ అనుకూలిస్తేనే ఎంతో కొంత మిగులు ఉంటుంది. ఒకవేళ నష్టం వచ్చినా రైతు వ్యవసాయాన్ని వదల్లేడు. తరువాత పంటలోనైనా మేలు జరుగుతుందనే ఆశతో మరోసారి అడుగు వేస్తాడు.

– ప్రగడ వీర వెంకట్రావు,
రైతు, నరేంద్రపురం

ధాన్యం కొనుగోలు చేయాలి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిరంతరం అన్నదాతల మేలు కోసమే ఆలోచించి, ఆచరణీయమైన నిర్ణయాలతో ముందుకు వెళ్లేది. రైతులు ఆ విషయాన్ని నేడు గ్రహిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమైనప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో, మిల్లర్లు చెప్పిన ధరకే పంటను అమ్ముకోవలసిన దుస్థితి ఏర్పడింది. ఇదే సీజన్‌లో గత ప్రభుత్వం బస్తా ధాన్యానికి రూ.1,750 గిట్టుబాటు ధర ప్రకటించడంతో మిల్లర్లు రూ.1,800కు పైబడి కొనుగోలు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేక రైతులు నష్టపోతున్నారు. పాలకులు వెంటనే మేల్కొని, తక్షణమే ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి.

– అడబాల చినబాబు,
వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు

కొండపై భక్తుల సందడి

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరికి ఆదివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కొండ పైన, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ శనివారం రాత్రి, ఆదివారం ఉదయం పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవదంపతులు, పెళ్లి బృందాలతో పాటు సెలవు దినం కావడంతో ఇతర భక్తులు కూడా పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 40 వేల మంది సత్యదేవుని దర్శించుకున్నారు. క్యూలు, వ్రత మండపాలు, ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా మారిపోయింది. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో శ్రీకృష్ణుడు, గోవులకు ప్రదక్షిణ చేశారు. అనంతరం, రావి చెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణలు చేశారు. స్వామివారి వ్రతాలు మూడు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. ఐదు వేల మంది సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని టేకు రథంపై ఆలయ ప్రాకారంలో ఉదయం ఘనంగా ఊరేగించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల ఘోష నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రాగా, స్వామి, అమ్మవార్లను రథంపై మూడుసార్లు ఊరేగించారు.

తలుపులమ్మ సన్నిధి.. రద్దీ



తలుపులమ్మ తల్లిని దర్శించేందుకు క్యూలో వేచి ఉన్న భక్తులు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో ఆదివారం రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో 10 వేల మంది భక్తులు అమ్మవారి సన్నిధికి తరలి వచ్చారని దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,83,165, పూజా టికెట్లకు రూ.1,76,300, కేశఖండన శాలకు రూ.13,440, వాహన పూజలకు రూ.6,800, వసతి గదులు, పొంగలి షెడ్లు, కాటేజీల అద్దెలు రూ.81,572, విరాళాలు రూ.65,135, వెరసి మొత్తం రూ.5,26,412 ఆదాయం సమకూరిందని వివరించారు. వసతి గదులు లభించని భక్తులు ఆలయ ప్రాంగణంలో చెట్ల కింద, కొండ దిగువన ప్రైవేటు కాటేజీల్లోను వంటలు, భోజనాలు చేశారు.

ఏసీ బస్సులో 10 శాతం రాయితీ

అమలాపురం రూరల్: ఆర్టీసీ అమలాపురం డిపో నుంచి హైదరాబాద్‌కు నడుపుతున్న అమరావతి ఏసీ బస్సు టికెట్ రేట్లలో ఈ నెల 31 వరకూ 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్‌టీపీ రాఘవకుమార్ ఆదివారం తెలిపారు. అమలాపురం నుంచి హైదరాబాద్ ఎంజీబీఎస్‌కు రూ.1,250, బీహెచ్ఈఎల్‌కు రూ.1,300 ధరతో టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. అమలాపురం నుంచి రాత్రి 8.30 గంటలకు, హైదరాబాద్ నుంచి రాత్రి 7.45 గంటలకు ఈ బస్సు బయలుదేరుతుందని తెలిపారు.

రాజానగరం

- టీడీపీలో తారస్థాయికి చేరిన వర్గ విభేదాలు
- రెండు వర్గాలుగా బొడ్డు, పెందుర్తి
- తరచూ పరస్పర విమర్శనాస్త్రాలు
- పల్లా వద్దకు చేరిన పంచాయితీ
- చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని బొడ్డు వర్గానికి భరోసా
- పెందుర్తి వర్గానికి మందలింపు!



బొడ్డు వెంకట రమణ చౌదరి



పెందుర్తి వెంకటేష్



పెందుర్తి అభిరామ్

సాక్షి, రాజమహేంద్రవరం: రాజానగరం నియోజకవర్గ టీడీపీలో కొన్ని నెలలుగా సాగుతున్న ఆధిపత్య పోరు తారస్థాయికి చేరింది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి, సీఎం పర్యటన వ్యవహారాల పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ వర్గాల మధ్య పోరు తీవ్ర రూపం దాల్చుతోంది. ఒకరిపై మరొకరు విమర్శనాస్త్రాలు గుప్పించుకుంటున్నారు. నువ్వెంతంటే.. నువ్వెంత అంటూ సవాళ్లు, ప్రతి సవాళ్లు చేసుకుంటున్నారు. దీనికి మాజీ ఎమ్మెల్యే వెంకటేష్ తనయుడు అభిరామ్ వ్యవహార శైలి కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని రోజులుగా అభిరామ్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించడం, పార్టీ శ్రేణులతో మంతనాలు చేస్తుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరికి ఇప్పటికే రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్ పదవి దక్కడంతో.. పార్టీ ఇన్‌చార్జి పదవి తమకు ఇవ్వాలని పెందుర్తి వర్గం డిమాండ్ చేస్తోంది. ఈ కోణంలో పెందుర్తి వర్గం స్పీడ్ పెంచింది. కట్టె కాలే వరకూ తాము టీడీపీలోనే కొనసాగుతామంటూ ఇటీవల పెందుర్తి అభిరామ్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. అదే క్రమంలో ఎవరితోనో తమకేం పనంటూ బొడ్డు వర్గంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

వివాదం మొదలైందిలా..

సీఎం చంద్రబాబు తన పర్యటన వ్యవహారాల ఇన్‌చార్జిగా పెందుర్తి వెంకటేష్‌ను నియమించడంతో ఆయన తనయుడు అభిరామ్ నియోజకవర్గంలో ఒక్కసారిగా యాక్టివ్ అయ్యారు. తండ్రితో పరిచయం ఉన్న నేతలతో మంతనాలు చేస్తూ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవిని దక్కించుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. తనకు చినబాబు లోకేష్ అండదండలున్నాయని, ఈ పదవి తనకే దక్కుతుందనే ధీమాలో ఆయన ఉన్నట్లు తెలిసింది. దీనిపై లోకేష్ నుంచి సైతం సుముఖత వ్యక్తమైనట్లు తెలుస్తోంది. మరోవైపు ఇన్‌చార్జి పదవి కోసం వెంకటేష్ సైతం చంద్రబాబు స్థాయిలో పట్టుబడుతున్నట్లు చెబుతున్నారు. ఈ పరిణామం బొడ్డు వర్గంలో ఆగ్రహావేశాలు నింపుతోంది. కష్టకాలంలో పార్టీకి సేవ చేసిన బొడ్డుకు నియోజకవర్గ పదవిని దూరం చేయడమేమిటని ఆయన వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను సైతం త్యాగం చేసిన తమ నేతను విస్మరించాలని చూడటమేమిటన్నది వారి వాదన.

- ఇటీవల సీతానగరం మండలం రఘుదేవపురంలోని పేకాట స్థావరంపై ఓ వర్గం దాడులు చేసి, కేసు నమోదు చేయడానికి ప్రయత్నించారని మరో వర్గం ఆరోపించింది.
- టీడీపీలోని ఓ వర్గం ఇచ్చిన సమాచారంతో కోరుకొండ పోలీసులు కోడిపందాలపై దాడి చేసి, మరో వర్గానికి చెందిన పలువురిని కోర్టుకు తరలించారు. ఇలా ఒకరిపై ఒకరు ఆధిపత్యం నిరూపించుకునేందుకు పరస్పర కక్ష సాధింపులకు పాల్పడుతున్నట్లు ఆ పార్టీ శ్రేణులే చెబుతున్నాయి.
- కేసులు చాలవన్నట్లు రెండు వర్గాల వారూ ఒకరిపై ఒకరు సోషల్ మీడియా వేదికగా రెచ్చిపోతున్నారు.
- ఇరు వర్గాల మధ్య విభేదాలతో తాము నలిగిపోతున్నామని అధికారులు వాపోతున్నారు.

అభిరామ్‌పై పల్లాకు ఫిర్యాదు

ఈ పంచాయితీ కాస్తా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వద్దకు చేరింది. కొన్నేళ్లుగా టీడీపీలో కొనసాగుతున్న వారిని లక్ష్యంగా చేసుకుని అభిరామ్ వేధింపులకు పాల్పడుతున్నారని వైరి వర్గం ఆరోపించింది. అక్కడితో ఆగకుండా ఆయన తమ ఆర్థిక మూలాలను దెబ్బ తీస్తున్నారంటూ రాజానగరం, సీతానగరం, కోరుకొండకు చెందిన నాయకులు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడికి ఇటీవల ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. టీడీపీ నేతలను అభిరామ్ దూషించిన వీడియోలను సైతం అందజేసినట్లు సమాచారం. దీని వెనుక బొడ్డు వర్గం ఉందని పెందుర్తి వర్గం భావిస్తోంది. ఈ విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని కార్యకర్తలకు భరోసా ఇచ్చిన పల్లా.. ఇప్పటికే ఆ పని కూడా పూర్తి చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అంతే కాకుండా అభిరామ్‌ను హద్దులో పెట్టాలంటూ ఆయన తండ్రి పెందుర్తి వెంకటేష్‌కు సూచించినట్లు చెబుతున్నారు. మరోవైపు ఇరు వర్గాల నేతలు సోషల్ మీడియా వేదికగా పరస్పరం విమర్శనాస్త్రాలు గుప్పిస్తున్నారు. తలనొప్పిగా మారిన ఈ వివాదంపై అధిష్టానం ఏవిధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

బలవన్మరణానికి అనుమతించండి

- రాష్ట్రపతి, సీజేఐకి విశ్రాంత ఉద్యోగి విన్నపం
- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తోందని ఆవేదన



బలవన్మరణానికి దరఖాస్తు చేసుకున్న విశ్రాంత ఉద్యోగి మూర్తి

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): 'నేను ఏ తప్పూ చేయకపోయినా సస్పెండ్ చేశారు. చేయని తప్పుకు 12 ఏళ్లుగా శిక్ష అనుభవిస్తున్నా. నాపై మోపిన అభియోగం రుజువు కాలేదు. అయినా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా ప్రస్తుత ప్రభుత్వం వేధిస్తోంది. నేను బతికి ఉండగా పెన్షన్ వస్తుందో, రాదో? ఇక ఈ బాధలు పడలేను. బలవన్మరణానికి అనుమతివ్వండి' అంటూ ఓ విశ్రాంత ఉద్యోగి.. రాష్ట్రపతి, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి దరఖాస్తు చేసుకున్నారు. తనకు జరిగిన అన్యాయాన్ని ఆదివారం విజయవాడలో మీడియాకు వివరించారు. వివరాలివీ.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కందరాడకు చెందిన పీవీవీఎస్ఎస్ మూర్తి 2007 నుంచి 2011 వరకూ ఆ గ్రామ వీఆర్వోగా పని చేశారు. ఆ తర్వాత సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. 2023 ఆగస్టులో రిటైరయ్యారు. కాగా, 2011లో రైతులకు ప్రభుత్వం ఇచ్చిన ఇన్‌పుట్ సబ్సిడీలో మూర్తి అవకతవకలకు పాల్పడ్డారంటూ కలెక్టర్‌కు తహసీల్దార్ నివేదిక పంపారు. దీనిపై ఎలాంటి విచారణ చేపట్టకుండా మూర్తిని 2013లో సస్పెండ్ చేశారు. తనకు న్యాయం చేయాలంటూ మూర్తి అనేకసార్లు అప్పటి, ఆ తర్వాతి ప్రభుత్వానికి విజ్ఞాపనలు చేసుకున్నారు. ఆయనపై మోపిన అభియోగాలు నిరాధారమని గత ప్రభుత్వ హయాంలో విచారణాధికారి తేల్చారు. ఈ నివేదిక పంపి దాదాపు రెండేళ్లవుతోంది. అయినప్పటికీ మూర్తికి పూర్తి పెన్షన్ మంజూరవ్వలేదు. దీనిపై కోర్టును ఆశ్రయించగా.. రిటైర్‌మెంట్ బెనిఫిట్లు ఇవ్వాలని న్యాయస్థానం 9 నెలల క్రితం ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాలను ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదు. దీంతో, తాను మానసికంగా కుంగిపోయానని.. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నానని మూర్తి కన్నీరు పెట్టుకున్నారు. ప్రభుత్వ తీరుతో విసిగిపోయానని, అందుకే బలవన్మరణం కోసం రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి దరఖాస్తు చేసుకున్నానని చెప్పారు.

నేడు కొలువుదీరనున్న కొత్త ఉపాధ్యాయులు

లీప్ యాప్‌లో పోస్టింగ్ ఆర్డర్ల విడుదల

రాయవరం: డీఎస్సీ–2025 ఉపాధ్యాయులు సోమవారం కొలువుదీరనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1,241 పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారు. 1,230 పోస్టులకు పోస్టింగ్ ఆర్డర్లు విడుదలయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 414 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరనున్నారు. వీరిలో 28 మంది మున్సిపల్ యాజమాన్యాల్లో నియామకం పొందగా, ప్రభుత్వ/స్థానిక సంస్థల యాజమాన్యాల్లో 386 మంది చేరనున్నారు. తూర్పు గోదావరి జిల్లాకు 164 మంది ఉపాధ్యాయులను కేటాయించగా, వీరిలో 53 మంది మున్సిపల్ కార్పొరేషన్, 111 మంది ప్రభుత్వ/స్థానిక సంస్థల యాజమాన్యాల పరిధిలో నియామకం పొందారు. కాకినాడ జిల్లాకు వివిధ కేటగిరీలకు చెందిన 474 మంది ఉపాధ్యాయులను నియమించారు. వీరిలో 124 మంది మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్‌లోను, 350 మంది ప్రభుత్వ/స్థానిక సంస్థల్లో నియమితులయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 173 మంది ప్రభుత్వ/స్థానిక సంస్థల యాజమాన్యాల పరిధిలో వివిధ క్యాటగిరీల కింద నియామకం పొందారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి తరఫున నియామక ఉత్తర్వులు లీప్ యాప్‌లో జారీ చేశారు. ఉపాధ్యాయులు సోమవారం వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరతారు.

తూర్పుగోదావరి జిల్లా

కేటగిరీ పోస్టు	మున్సిపల్	ప్రభుత్వ/స్థానిక సంస్థలు
ఎస్ఏ ఇంగ్లిషు	02	06
ఎస్ఏ హిందీ	0	06
ఎస్ఏ తెలుగు	01	02
ఎస్ఏ బీఎస్	0	19
ఎస్ఏ గణితం	0	05
ఎస్ఏ పీఈ	0	42
ఎస్ఏ పీఎస్	2	04
ఎస్ఏ ఎస్ఎస్	6	17
ఎస్‌జీటీ	42	10

చూసిన కనులదే భాగ్యం!

- వైభవంగా వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు
- 3వ రోజు స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు

కొత్తపేట: కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రంలో శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడోరోజు తిరువీధుల్లో శ్రీవారి విహార ఘట్టం కన్నుల వైకుంఠంగా సాగింది. శ్రీవారు కోదండరాముని అలంకరణలో హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు ఈ వాహన సేవను వీక్షించారు. భక్తుల గోవింద నామస్మరణతో వాడపల్లి క్షేత్రం మార్మోగింది. ఖండవిల్లి రాజేశ్వరవర ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, అర్చక బృందం స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృత మండపారాధన, మహాస్నపనము, ప్రధాన హోమాలు, దుష్టగహ పరిహారార్థం మహాసుదర్శన హోమం, తోమాల సేవ, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి స్వస్తివచనం, ప్రధాన హోమాలు, స్వామివారికి విశేషార్చన, చతుర్వేద స్వస్తి, దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. దేవస్థానం తరపున డీసీ అండ్ ఈఓ చక్రధరరావు దంపతులు, ఉత్సవ కమిటీ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు.


మాడవీధుల్లో హనుమద్వాహనంపై కోదండరామునిగా ఊరేగుతున్న శ్రీవారు


వాడపల్లి క్షేత్రంలో మహిళల కోలాటం ప్రదర్శన


మహాసుదర్శన హోమం నిర్వహిస్తున్న ఈఓ చక్రధరరావు దంపతులు

నేటి కార్యక్రమాలు ఇవీ..

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు సోమవారం బ్రహ్మోత్సవాల నిత్య పూజలు, హోమాలు, అభిషేకాలతో పాటు ఉదయం జగత్ కళ్యాణార్థం శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తారు. సాయంత్రం విశేష పూజలు, సేవలు, రాత్రి యోగనారసింహ అలంకరణతో సింహ వాహన సేవ నిర్వహిస్తారు.

హనుమద్వాహనంపై శ్రీవారి విహారం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు కోదండ రామ అలంకరణలో హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి హనుమద్వాహనంపై స్వామివారిని అలంకరించగా మాడ వీధుల్లో ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లో శ్రీవారిని కోదండరాముని అవతారంలో అలంకరించి, హనుమంత వాహనంపై ఊరేగించడం ఆనవాయితీ. ఈ ఘట్టం హనుమంతుడు తన భుజాలపై శ్రీరాముడిని మోసిన సందర్భాన్ని గుర్తు చేస్తుంది. హనమద్వాహనంపై స్వామి వారి విహారం భగవంతుని పట్ల హనుమతునికి ఉన్న భక్తికి, నమ్మకానికి, అణకువకు ప్రతీక. ఈ వాహన సేవ మనిషిలోని భక్తి, సేవ ద్వారా దివ్యత్వానికి ఎలా చేరగలరో చూపిస్తుంది. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్సై రాము బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

రూ.ఐదు లక్షల దీపావళి సామాన్లు సీజ్


ఎస్.అన్నవరంలో అక్రమంగా నిల్వ ఉంచిన దీపావళి సామాన్లను సీజ్ చేస్తున్న పోలీస్, రెవెన్యూ అధికారులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన రూ.ఐదు లక్షల విలువ చేసే దీపావళి సామాన్లను సీజ్ చేసినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి ఆదివారం తెలిపారు. ముందస్తు చర్యగా తనిఖీలు చేస్తుండగా ఎస్.అన్నవరంలో అక్రమంగా నిల్వ ఉంచిన దీపావళి సామాన్లను గుర్తించామన్నారు. సామాన్లను సీజ్ చేసి ఒకరిని అరెస్టు చేశామన్నారు. తనిఖీల్లో డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, వీఆర్వో కృష్ణ పాల్గొన్నారు.

7వ బ్యాచ్ శిక్షణ ప్రారంభం


శిక్షణలో మాట్లాడుతున్న ఈటీసీ ప్రిన్సిపాల్ ప్రసాదరావు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాలోని మండల పరిషత్తు పరిధిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు, డిప్యూటీ ఎంపీడీఓలకు నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా ఆదివారం 7వ బ్యాచ్ శిక్షణను గ్రామీణ తాగునీటి విభాగం ప్రభుత్వ సలహాదారు తోట ప్రభాకరరావు ప్రారంభించారు. తాగునీటిపై ఏఈఈలకు అవగాహన ఉండాలన్నారు. విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావు, విశ్రాంత ఎస్ఈలు ఉమాశంకర్, శ్రీనివాసు, సురేష్, పెద్దాపురం డీఈఈ స్వామి, ఏఈఈ శ్రీరామ్, ఈటీసీ సీనియర్ ఫ్యాకల్టీ శేషుబాబు శిక్షణ నిర్వహించారు.

రామాలయంలో నగల చోరీ

రంగంపేట: మండల పరిధిలోని ముకుందవరంలో దేవుని గుడిలో నగలు మాయమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని కాపుల రామాలయంలో దేవతల విగ్రహాలకు నాలుగు వెండి కిరీటాలు, అమ్మవారి బంగారు తాళిబొట్టు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వెండి కిరీటాల విలువ రూ.1.50 లక్షలు, బంగారం విలువ రూ. 1.20 లక్షలు ఉంటుందన్నారు. నగలు చోరీ జరిగినట్టు 9వ తేదీ గురువారం గుర్తించామన్నారు. 9వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

సినీ ఫక్కీలో యువతి కిడ్నాప్

స్థానికుల సమాచారంతో పోలీసులకు చిక్కిన కిడ్నాపర్లు

పిఠాపురం: అనకాపల్లిలో ఒక యువతిని కిడ్నాప్ చేసి కారులో తీసుకుని వెళుతూ గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పోలీసులకు చిక్కారు కిడ్నాపర్లు. గొల్లప్రోలు ఎస్సై నౌడు రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట మండలం, శ్రీరాంపురం గ్రామానికి చెందిన ఒక యువతి, కర్రి వంశీ, మహమ్మద్ అల్తాఫ్ అనే ఇద్దరితో ఒకే సమయంలో ప్రేమ వ్యవహారం జరిపింది. వారి ముగ్గురి మధ్య ప్రేమ వ్యవహారంపై కొంతకాలంగా వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఏర్పడిన గొడవ కారణంగా శనివారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో మహమ్మద్ అల్తాఫ్ అతని స్కూటర్‌పై ఎక్కించుకుని తుని సమీపంలోని రాజానగరం బీచ్ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ కర్రి వంశీతో కలిసి యువతిని బలవంతంగా కారులో ఎక్కించుకుని మహమ్మద్ అల్తాఫ్, కర్రి వంశీ అతని స్నేహితుడు రాజు ముగ్గురు కలిసి ఆమెను బెదిరించారు. ప్రేమ వ్యవహారం జరుపుతున్న వారిద్దరిలో ఎవరో ఒకరిని తేల్చుకోవాలని భయపెట్టి ఆమెను కొట్టి చుట్టుపక్కల ప్రాంతాలు తిప్పుతూ అన్నవరం, కత్తిపూడి మీదగా చేబ్రోలు గ్రామం తీసుకు వచ్చారు. అక్కడ నిర్మానుష్యంగా హైవే పక్కన ఉన్న మట్టి రోడ్డులోకి తీసుకుని వెళ్లారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న సాంబ అని వేరే వ్యక్తితో ఆమెను బెదిరించారు. దీంతో ఆమె కేకలు వేయగా ఘటనను గమనించిన చుట్టుపక్కల వారు పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ యువతిని రక్షించి నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

పదికి చేరిన 'బాణసంచా' మృతులు

చికిత్స పొందుతూ మరో ఇద్దరి మృతి

కాకినాడ క్రైం/అనపర్తి: ఈ నెల 8న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ బాణసంచా తయారీ కేంద్రంలో చోటు చేసుకున్న పెను విస్ఫోటం వల్ల మృతి చెందినవారి సంఖ్య పదికి చేరింది. ఆదివారం కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరో ఇద్దరు క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోయారు. ఘటన జరిగిన సమయంలో అక్కడికక్కడే ఆరుగురు మృతి చెందగా, తీవ్ర గాయాలపాలైన క్షతగాత్రులు నలుగురిని కాకినాడకు తరలించారు. వారిలో ముగ్గురు కాకినాడ జీజీహెచ్‌లో చేరగా మరో వ్యక్తి ట్రస్ట్ ఆసుపత్రిలో చేరాడు. ఘటన జరిగిన రోజు సాయంత్రం ట్రస్ట్ ఆసుపత్రిలో చేరిన పాట్నూరి వెంకటరమణ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. అదే రోజు అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వాసంశెట్టి విజయలక్ష్మి అనే మహిళ కాకినాడ జీజీహెచ్‌లో మృతి చెందింది. ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడుతూ జీజీహెచ్ ఎస్ఐసీయూలో చికిత్స పొందుతున్న అనపర్తికి చెందిన చిట్టూరి యామిని(32) ఆదివారం తెల్లవారుజామున ఉదయం 3.19 గంటలకు ప్రాణాలొదిలింది. అదే ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న పెదపూడి మండలం వేంద్ర గ్రామానికి చెందిన లింగం వెంకటకృష్ణ (21)కాలిపోయి మాంసపు ముద్దగా మారి తుది వరకు మృత్యువుతో పోరాడాడు. ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రాణాలు విడిచాడు. ఆదివారం నాటి మరణాలతో విస్ఫోటంలో తీవ్ర గాయాలపాలైన వారిలో ఏ ఒక్కరూ ప్రాణాలతో మిగల్లేదు.

అనపర్తిలో విషాద ఛాయలు

మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అధికారులు వారి బంధువులకు అప్పగించారు. అనపర్తికి చెందిన యామిని మృతదేహం మధ్యాహ్నం తీసుకురావడంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి.



చికిత్స పొందుతూ మృతిచెందిన వెంకటకృష్ణ, యామిని (ఫైల్)

ఆధారం కోల్పోయిన కుటుంబం

పెదపూడి మండలం వేంద్ర గ్రామానికి చెందిన లింగం వెంకటకృష్ణ పెయింటింగ్ పనులు చేసుకుంటూ తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. అవివాహితుడైన వెంకటకృష్ణ దీపావళి సీజనల్ సమయంలో ఫైర్‌వర్క్స్‌లో పనులుకు వెళ్తుంటాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. వేంద్ర నుంచి రాయవరం బాణసంచా తయారీ కేంద్రంలో పనులకు వచ్చిన వెంకటకృష్ణ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యాడు. తల్లి వెంకటలక్ష్మి, తండ్రి రాము హైదరాబాద్‌లో పనికి వెళ్లి అక్కడే ఉంటున్నారు. ప్రస్తుతం అన్నయ్య శేఖర్ వద్ద ఉంటూ పనికి వెళ్తున్నాడు. మృతుడు కృష్ణకు అక్క ప్రియాంక ఉంది. తమకు ఆధారంగా ఉన్న కుమారుడు మృతి చెందడం తల్లిదండ్రులను శోకసంద్రంలోకి నెట్టింది. వివాహం చేద్దామనుకుంటున్న సమయంలో ఇంత ఘోరం జరగడం కుటుంబ సభ్యులను తీవ్రంగా కలచివేసింది.

చిట్టీ పేరుతో మోసగించిన 13 మందిపై కేసు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం తాపేశ్వరం గ్రామానికి చెందిన గ్రంధి సూర్య వెంకట ప్రకాశరావు తాను చిట్టీ కట్టి మోసపోయానంటూ ఈ నెల 10న మండపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండపేట, తదితర ప్రాంతాలకు చెందిన 13 మంది గుప్తా చిట్స్ అండ్ ఫైనాన్స్ సంస్థ డైరెక్టర్లుమంటూ చెప్పి తనతో చిట్టీ కట్టించి మోసగించారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. మండపేట రూరల్ ఎస్సై వాడపల్లి కిశోర్ కేసు నమోదు చేశారు. నిందితులు వాకచర్ల వీర వెంకట సత్యనారాయణ, చక్కా శ్రీవీర వెంకట సత్యనారాయణ, వాకచర్ల వాసంతి, వాకచర్ల మౌర్యగుప్త, వాకచర్ల శౌర్యగుప్త, చక్కా సూర్యకళ, కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన చక్కా రాంబాబు, చక్కా నాగేశ్వరరావు, చక్కా నాగమణి, కాకినాడకు చెందిన దొంతుల రామకృష్ణ, దొంతుల లక్ష్మి, పెదపూడి గ్రామానికి చెందిన ఒబిలిశెట్టి మల్లికార్జునరావు, ఒబిలిశెట్టి సత్యవేణిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వాడపల్లి కిశోర్ తెలిపారు. చిట్టీ ద్వారా కట్టిన డబ్బును షేర్ మార్కెట్‌లో పెట్టుబడులుగా పెడతామని, అధిక లాభాలను వస్తాయని నమ్మించడంతో తాను మొత్తం రూ.22,30,000 కట్టానని, నెల నెలా తన వద్ద చిట్టీ కట్టించుకునేవారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు డబ్బు అవసరమని చెప్పగా ఆగస్టు 18న తాపేశ్వరంలోని తన ఇంటికి వచ్చి చిట్టీలకు సంబంధించిన పేపర్లు తీసుకెళ్లి ఎంత మొత్తం వచ్చేదీ చెబుతానని నమ్మబలికి మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మహిళా కబడ్డీ టోర్నమెంట్ కమ్ సెలెక్షన్స్ ప్రారంభం


ఉత్కంఠగా సాగుతున్న మహిళ జట్టు కబడ్డీ పోటీ ఎంపికలు

పెదపూడి: జి.మామిడాడ డీఎల్ రెడ్డి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ మహిళల కబడ్డీ జట్టు టోర్నమెంట్ కమ్ సెలెక్షన్స్‌ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా జి.మామిడాడ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ, కరస్పాండెంట్ డి.ఆర్.కే.రెడ్డి హాజరయ్యారు. డీఆర్‌కే రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ సబ్బెళ్ల శివన్నారాయణ రెడ్డి మాట్లాడుతూ రెండ్రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల నుంచి యూనివర్సిటీ పరిధిలోని 11 కళాశాలలకు చెందిన 150 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. వీరిలో 14 మందిని విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపిక చేస్తారన్నారు. ఈ జట్టు ఈ నెల 29 నుంచి నవంబర్ రెండు వరకు తమిళనాడు రాష్ట్రం సేలంలో వినాయక మిషన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా కబడ్డీ టోర్నమెంట్లో పాల్గొంటుందన్నారు. ఎంపికైన జట్టుకు పది రోజులపాటు డీఎల్ రెడ్డి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తారన్నారు. అబ్జర్వర్లుగా డాక్టర్ జీ.ప్రమీలరాణి, సభ్యులుగా వై.సుధారాణి, ఎం.వీరబాబు వ్యవహరించారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.లోవరాజు, జి.మామిడాడ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ఎం.రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

సత్యదీక్ష వస్త్రాలు, మాలల పంపిణీ


దీక్షా వస్త్రాలు పంపిణీ చేస్తున్న దేవస్థానం చైర్మన్ రోహిత్, ఈఓ సుబ్బారావు


'సత్యదీక్ష'కు ప్రచారమేదీ..?

- రత్నగిరిపై 17 నుంచి ప్రారంభం
- ఇంకా వివరాలు ప్రకటించని అధికారులు

శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్

అన్నవరం: ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న సత్యదీక్షలకు ప్రచారంతో బాటు సత్యదీక్షలు చేపట్టే స్వాములకు దీక్షా వస్త్రాలు, మాలలు, దీక్షా నియమాల పుస్తకాల పంపిణీని ఆదివారం ప్రారంభించారు. శనివారం సాక్షి దినపత్రికలో 'సత్యదీక్షకు ప్రచారమేదీ? శీర్షికన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఆ వార్తకు స్పందించిన దేవస్థానం అధికారులుచైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు చేతులమీదుగా ఆదివారం దీక్షా వస్త్రాల పంపిణీ ప్రారంభించారు. త్వరలో అల్లూరి జిల్లా అడ్డతీగలలో కూడా ఈ దీక్షా వస్త్రాలు పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. సత్యదీక్షలపై సత్యరథంతో ప్రచారం చేయిస్తున్నట్టు తెలిపారు.

ఏసీ గదులు ఇస్తామని చెప్పి దళారీల మోసం

రత్నగిరి ఈఓకు భక్తుని ఫిర్యాదు

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో రూ.25 వేలుకు ఉచిత ఏసీ కల్యాణ మండపం, రెండు ఏసీ రూమ్స్ ఇప్పిస్తామని చెప్పి ఇద్దరు దళారీలు నాన్ ఏసీ మండపం , గదులు ఇచ్చి తనను మోసం చేశారని పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండకు చెందిన తోట నాగతేజ దేవస్థానం ఓ వీర్ల సుబ్బారావుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆయన గత ఆగస్టులో దేవస్థానానికి విచ్చేసి అక్టోబర్ 11వ తేదీన వివాహం ఉందని దానికి ఉచిత ఏసీ మండపం, ఏసీ గదులు కావాలని అడిగారు. సీఆర్వో సిబ్బంది వీటిని నెల ముందు మాత్రమే బుక్ చేస్తామని చెప్పారు. దాంతో వెలుపలకు వచ్చిన ఆయనను అశోక్, పోరి అనే వ్యక్తులు కలిసి తాము ఆ తేదీ కల్లా ఉచిత ఏసీ కల్యాణ మండపం, రెండు ఏసీ గదులు, పురోహితుడు, సన్నాయి మేళాలను బుక్ చేస్తామని రూ.25 వేలు ఇవ్వమని అడిగారు. వారిని నమ్మి ఆ మొత్తం చెల్లించారు. అయితే ఈ నెల 11 ఉదయం పెళ్లి బృందం రాగా, వారికి నాన్ ఏసీ కల్యాణ మండపం, నాన్ ఏసీ గదులు మాత్రమే ఇచ్చారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ దళారీలపై చర్య తీసుకోవాలని ఆయన ఈఓను కోరారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చేసిన యానాం పోలీసులు

యానాం: పట్టణంలో శనివారం సంచలనం కలిగించిన వ్యక్తి దారుణహత్య కేసుకు సంబంధించి నిందితుడిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు సీఐ అడలరసన్ తెలిపారు. ఈ హత్యకేసుకు సంబంధించి వివరాలను ఆయన విలేకరులకు వివరించారు. కాజులూరు మండలానికి చెందిన హతుడు తిప్పరశెట్టి నారాయణస్వామి 2022, మార్చి 12న యానాం గోపాల్‌నగర్ శివారు మోకా గార్డెన్స్‌కు చెందిన మోకా వెంకటేశ్వరరావు అలియాస్ బుజ్జిని అతని స్వగృహంలోనే కత్తితో పొడిచి హత్య చేశాడన్నారు. ఆర్థిక లావాదేవీలు, చీటీలకు సంబంధించిన సొమ్ము గురించి అప్పట్లో ఆ హత్య జరిగిందన్నారు. ఈ కేసుకు సంబంధించి పుదుచ్చేరి కాలాపేట జైలులో శిక్ష అనుభవిస్తున్న నారాయణస్వామి ఇటీవలి కండిషన్ బెయిల్‌పై విడుదలయ్యాడన్నారు. ప్రతి రోజూ యానాం పోలీస్‌స్టేషన్‌లో సంతకం పెడుతున్నాడని తెలిపారు. శనివారం రాత్రి మోకా వెంకటేశ్వరరావు కుమారుడు మోకా ఆనందమూర్తి బైక్ పై వచ్చి స్థానిక న్యూకాంప్లెక్స్ సమీపంలో మెయిన్‌రోడ్డుపై ఉన్న తిప్పరశెట్టి నారాయణసామిని కత్తితో విచక్షణా రహితంగా 13 పోట్లు పొడిచాడని దీంతో నారాయణసామి మృతిచెందాడన్నారు. శనివారం మోకా ఆనందమూర్తి కుమారుడు, వెంకటేశ్వరరావు మనుమడు పుట్టినరోజు అని తెలిపారు. దీంతో తన తండ్రి ఉంటే మనుమడి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగేవని కాని తన తండ్రి లేకుండా చేసింది నారాయణస్వామి అని కక్ష పెంచుకున్నాడన్నారు. ఈ నేపథ్యంలో మద్యం తాగి రావడం.. యాధృచ్ఛికంగా మెయిన్‌రోడ్డుపై నిలబడి ఉన్న నారాయణస్వామి కనిపించడంతో విచక్షణారహితంగా కత్తితో పొడిచి చంపాడన్నారు. అతని మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. నిందితుడి నుంచి కత్తి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని సబ్‌కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు. ఘటన జరిగిన 24 గంటల్లోనే నిందితుడిని పట్టుకున్న క్రైమ్ టీమ్ జాంటీ, దుర్గారావు ను అభినందించారు. ఈ సమావేశంలో ఎస్సైలు పునీత్‌రాజ్, కట్టా సుబ్బరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్యదేవునికి సంప్రోక్షణ పూజలు

మూడు రోజుల పాటు కొనసాగనున్న హోమం


అపశ్రుతులు అందుకేనా..?

ఏడో తేదీన సాక్షి దినపత్రికలో 'అపశృతులు అందుకేనా...?' శీర్షికన ప్రచురితమైన వార్త


సాక్షి ఎఫెక్ట్


అన్నవరం: శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సోమవారం నుంచి సంప్రోక్షణ పూజలు, శాంతి హోమం నిర్వహించనున్నారు. ఆలయంలోని దర్బారు మండపంలో ఈ పూజలు, హోమాలు జరుగనున్నాయి. అన్నవరం దేవస్థానంలో కొన్ని నెలలుగా అనేక అగ్ని ప్రమాదాలు, అపశృతులు జరిగాయి. సత్రంలో ఒక భక్తుడు మృతి చెందాడు. దేవస్థానంలో చాలాకాలంగా సంప్రోక్షణ పూజలు కాని, యాగాలు, కోటి తులసి పూజలు కాని జరగకపోవడం వల్లనే మూడు నెలలుగా ప్రమాదాలు జరుగుతున్నాయని పండితులు, అర్చకస్వాములు అభిప్రాయపడ్డారు. దీనిపై ఏడో తేదీన సాక్షి దినపత్రికలో 'అపశృతులు అందుకేనా...? ' శీర్షికన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు స్పందించి పండితులతో చర్చించి శాంతి పూజలు నిర్వహించాలని ఆదేశించారు. దీనిపై దేవస్థానం వైదిక సలహాదారు కపిలవాయి రామశాస్త్రి సోమయాజిని దేవస్థానం పండితులు సంప్రదించగా సోమవారం నుంచి సంప్రోక్షణ పూజలు, శాంతి హోమం నిర్వహణకు ఆయన ముహూర్తం నిర్ణయించారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వైదిక కమిటీ సభ్యుడు గంగాధరబట్ల గంగబాబు తెలిపారు. బుధవారం శాంతిహోమం పూర్ణాహుతి అనంతరం మంత్రజలాన్ని దేవస్థానంలో వెదజల్లి శుద్ధి చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి

గండేపల్లి: మండలంలోని జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి చెందాడు. గండేపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయవాడ భవానీపురానికి చెందిన మాకిన దేవేంద్ర (29) ఆకుల సాంబశివరావు వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సాంబశివరావు, భార్య వెంకటరమణమ్మ కలిసి కారులో విజయవాడ నుంచి శనివారం ఉదయం అన్నవరం వచ్చి స్వామి దర్శనం, బంధువుల వివాహ వేడుక అనంతరం కారులో బయలుదేరారు. మురారి శివారు పోలవరం కాలువ వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీ డ్రైవర్ స్పీడుగా అజాగ్రత్తగా లారీని నడిపి సడన్‌గా బ్రేక్ వేయడంతో కారు నడుపుతున్న దేవేంద్ర కారును అదుపు చేయలేక లారీ వెనుక భాగంలో బలంగా ఢీకొట్టగా అదే మార్గంలో వస్తున్న మరో వాహనం కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ దేవేంద్రకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న సాంబశివరావు తలకు గాయాలయ్యాయి అన్నారు. కేసు దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు.

సెప్టిక్ ట్యాంక్‌లో ఆవు నరకయాతన


ఆవును బయటకు తీసేందుకు జేసీబీ సాయంతో యత్నిస్తున్న స్థానికులు


సెప్టిక్ ట్యాంక్ నుంచి బయటకు తీసిన ఆవుకు నీరు పెడుతున్న డాక్టర్ ప్రభాకర్, కౌన్సిలర్ రాజేష్

బయటకు తీసి రక్షించిన స్థానికులు

అమలాపురం టౌన్: సెప్టిక్ ట్యాంక్‌లో పడిన ఆవు నరకయాతన అనుభవించింది. నీరు, తిండి లేక బాగా నీరసించిపోయి కుంగిపోయింది. చివరకు స్థానికులు ఆ ఆవును సెప్టిక్ ట్యాంక్ నుంచి బయటకు తీసి రక్షించారు. అమలాపురం పట్టణం 22వ వార్డు పరిధి భోగరాజు వీధిలో తుప్పల్లో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో ఆవు ప్రమాదవశాత్తూ పడిపోయింది. పచ్చిక మేత కోసం వెళ్లిన ఆవు ఆ ట్యాంక్‌లో పడి బయటకు రాలేక పోయింది. అమలాపురం సత్యసాయి సేవా సంస్థల డివిజన్ కో ఆర్డినేటర్, ఈఎస్‌టీ నిపుణులు డాక్టర్ జి.ప్రభాకర్ ఈ సమాచారాన్ని ఆ వార్డు కౌన్సిలర్ గొవ్వాల రాజేష్‌కు అందించారు. జేసీబీని రప్పించి ఆవును బయటకు తీయించారు. స్థానికుల సహాయంతో గంటకు పైగా శ్రమించి ఆవును బయటకు తీశారు. స్థానికులు గంగుమళ్ల శ్రీను, మేడిద రమేష్, రాజులపూడి భాస్కరరావు శ్రమించారు. బయటకు తీసిన ఆవు బాగా నీరసించిపోయి ఉండడంతో దానికి తాగునీరు, అరటి పండ్లు పెట్టి సేద తీర్చారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	28,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 25,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 25,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350